ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 13 మార్చి 2024




ఓదేడు వంతెన పూర్తయ్యేదెన్నడో?
- పట్టించుకోని అధికారులు - 8లో..

మౌలిక వసతుల కల్పనకు కృషి
- ఎమ్మెల్యే విజయరమణారావు - 8లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:24 బుధవారం

సహర్ 4:56 గురువారం



తెల్లబంగారం తళతళ



పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తి(ఫైల్)

- క్వింటాలు పత్తికి రూ.7632 పలికిన ధర
- చివరి దశలో పెరుగుతున్న ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మద్దతు ధరకు మించి ధర పలుకుతుండడంతో మార్కెట్లో తెల్ల బంగారం(పత్తి) తళతళ మెరుస్తున్నది. పంట చివరి దశలో పత్తి పంటకు మద్దతు ధరలకు మించి అధిక ధరలు పలుకుతోంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం వరకు పత్తి ధరలు 6300 నుంచి 6800 రూపాయల వరకు ధరలు పలికాయి. 15 రోజుల క్రితం నుంచి క్రమంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. మంగళవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాల్ పత్తికి అత్యధికంగా 7632 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా 6011 , మోడల్ ధర 7431 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్‌కు 1031.80 క్వింటాళ్ల పత్తి రాగా, వ్యాపారులు మద్దతు ధరకు మించి కొనుగోలు చేయడం గమనార్హం. 6001 నుంచి 6500 వరకు 11 క్వింటాళ్లు, 6501 నుంచి 7000 రూపాయల వరకు 55 క్వింటాళ్లు, 7001 నుంచి 7500 రూపాయల వరకు 561 క్వింటాళ్లు, 7501 నుంచి ఎనిమిది వేల రూపాయల వరకు 404.80 క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సీజన్లో అత్యధిక ధర 7632 పలకడం ఇదే ప్రథమం. ఈనెల 4వ తేదీన 7283 రూపాయలు, 5వ తేదీన 7338 రూపాయలు, 6వ తేదీన 7358 రూపాయలు, 7వ తేదీన 7461 రూపాయలు, 11వ తేదీన 7551 రూపాయల ధర పలికింది. జిల్లాలో గడిచిన వర్షాకాలం సీజన్‌లో 57,704 ఎకరాల్లో రైతులు పత్తి పంటను వేశారు. జిల్లాలోని సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, మంథని, రామగిరి, ముత్తారం, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్ తదితర మండలాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా పత్తికి ధరలు నిలకడగా ఉన్నప్పటికీ, పంటకు తెగుళ్ల వస్తుండడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. పెట్టుబడులు కూడా అధికంగా పెరిగాయి. దీంతో రైతులు పత్తి పంటకు బదులు ఇతర పంటలను సాగు చేస్తున్నారు.

● జిల్లాలో 80 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఇప్పటివరకు అత్యధికంగా 80,000 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా, గడిచిన నాలుగేళ్లలో పత్తి సాగు 200 ఎకరాలు తగ్గింది. ఆయా భూముల కొందరు రైతులు బోర్లు వేసుకొని వరి సాగు చేస్తుండగా, మరికొందరు మొక్కజొన్న ఇతర పంటలు వేస్తున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు మీడియం స్టేబుల్ గల పత్తికి 6620 రూపాయలు, లాంగ్ స్టేబుల్ పత్తికి 7020 రూపాయల ధర చెల్లించాలి. కానీ సీజన్ ప్రారంభంలో 7000 వరకు క్వింటాల్ పత్తిని కొనుగోలు చేసిన వ్యాపారులు ఆ తర్వాత ధరలు తగ్గించారు. అంతర్జాతీయ మార్కెట్లో పత్తి ధరలు తగ్గడంతో ఇక్కడ కూడా వ్యాపారులు ధరలు తగ్గించారు. పెద్దపల్లి మార్కెట్లో ఇప్పటివరకు 58,888 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఓదెల, శ్రీరాంపూర్, ముత్తారం, మంథని తదితర ప్రాంతాలకు చెందిన రైతులు పత్తిని ఎక్కువగా జమ్మికుంట మార్కెట్లో విక్రయిస్తారు. జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలానికి చెందిన రైతులు ఎక్కువగా కరీంనగర్ మార్కెట్‌కు, చొప్పదండిలో జిన్నింగ్ మిల్లుల వ్యాపారులకు పత్తిని విక్రయించారు. మధ్యలో పత్తి ధరలు పడిపోవడంతో రైతులు చాలామంది ధరలు పెరిగే వరకు నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో పత్తి బేల్ పెరగడంతో రైతులకు కూడా తదనుగుణంగా ధరలను పెంచుతున్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు సాగనున్నాయి. ప్రస్తుతం మద్దతు ధరకు మించి ధర పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైస్‌మిల్లర్లు సకాలంలో బియ్యంను అప్పగించాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, మార్చి 12: యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు సకాలంలో బిడ్డర్లకు అప్పగించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత యాసంగికి సంబంధించిన 2లక్షల 6వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బిడ్డర్లకు వేలంలో కేటాయించి, ఈ ధాన్యాన్ని జిల్లాలోని 132 రైస్ మిల్లర్లకు కేటాయించామన్నారు. రైస్ మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో బిడ్డర్లకు అప్పగించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖరీఫ్ 2023-24కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ కూడా మొదలుపెట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు : మంథని ఆర్డీవో



గౌతరమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తున్న టూరిజం శాఖ అధికారులు

మంథని/రామగిరి 12: తెలంగాణలో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంథని ఆర్డీవో హనుమానాయక్ పేర్కొన్నారు. మంథని నియోజకవర్గం పరిధిలోని మంథని, రామగిరి మండలాలకు సంబంధించిన పలు పూరాతన ఆలయాలతోపాటు కాళేశ్వరంలోని పలు దేవాలయాలను తెలంగాణ టూరిజం శాఖకు చెందిన 8మంది బృందం మంగళవారం సందర్శించింది. మంథని పట్టణంలోని గౌతమేశ్వర స్వామి, మహాలక్ష్మి, చెరువు కట్ట సమీపంలోని శీలేశ్వర-సిద్దేశ్వర పురాతన ఆలయాలను పరిశీలించారు. అనంతరం కాళేశ్వరంలోని పలు పురాతన ఆలయాలతో పాటు రామగిరి మండలంలోని రామగిరిఖిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ టూరిజం శాఖ వారితో మంథని నియోజకవర్గం పరిధిలోని పలు ఆలయాల అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందంలో టూరిజం శాఖ కన్సల్టెన్సీ బండ శ్రీనివాస్, జీఎం ప్రాజెక్టు ఉపేందర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, రామకృష్ణ, అనుపమ. మౌనిక, తహసీల్దార్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతల స్వీకరణ



అధికారులతో మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

గోదావరిఖని, జ్యోతినగర్, మార్చి 12: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా రాష్ట్రపతి ఆదేశాలతో నియమితులైన వడ్డేపల్లి రాంచందర్ మంగళవారం ఢిల్లీలోని లోక్‌నాయక్ భవన్‌లోని కార్యాలయంలో పదవీబాధ్యతలు చేపట్టారు. ఎస్సీ కమిషన్ సభ్యులుగా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. రాష్ట్రపతి, పార్లమెంట్‌కు అనుసంధానంగా ఈ కమిషన్ పనిచేస్తుంది. ఛైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులు కమిషన్‌లో ఉంటారు. తెలంగాణ నుంచి వడ్డేపల్లి రాంచందర్‌కు అవకాశం దక్కింది. ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కే రాములు, ఎన్‌టీపీసీ అడిషనల్ ఎన్‌బీసీ సభ్యులు రాంనాథ గణేష, రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన నాయకులు రావుల రాజేందర్, గాలిపెల్లి తిరుపతి, భాస్కర్‌రెడ్డి, వడ్డేపల్లి శంకర్, సాగర్‌రాజు, తోట వేణు, తిరుపతి, క్రాంతి పాల్గొన్నారు.

'ఒకే స్టేషన్.. ఒకే ఉత్పత్తి' ప్రారంభం

పెద్దపల్లిటౌన్, మార్చి 12: పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒకే స్టేషన్, ఒకే ఉత్పత్తి కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు తిలకించారు. ఈ ప్రాంతంలో ఉత్పత్తి అయిన వస్తువులు ఈప్రాంతంలోనే అమ్ముకునే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లంపల్లి శ్రీనివాస్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18న మంథని మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక

మంథని, మార్చి 12: మంథని మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ల ఎన్నికను ఈనెల 18న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సీ పార్థసారథి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంథని ఆర్డీవో హనుమానాయక్‌ను మంథని మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక కోసం ఎన్నికల నిర్వహణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గతనెల 16న జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌ఛైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై జరిగిన అవిశ్వాసం నెగ్గడంతో వారు పదవుల కోల్పోయారు. దీంతో ఎన్నిక అనివార్యంగా మారడంతో ఈనెల 18న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను ఎన్నుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెద్దపల్లిటౌన్, మార్చి 12: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి వనజారాణి, ప్రధాన కార్యదర్శి జి జ్యోతి, ఎస్ రామలక్ష్మి ఆర్ కమలేష్ ఎం శోభ, సీహెచ్ సులోచన కృష్ణకుమారి స్వరూప సుగుణ జయసుధ పద్మ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

'కార్పొరేషన్‌కు చందర్ నిధులు తెచ్చింది అబద్ధం'

కోల్‌సిటీ, మార్చి 12: మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రామగుండం నగర అభివృద్ధికి నిధులు తెచ్చానని చెప్పడం అబద్ధమని, ఆత్మవంచన అని రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, కాంగ్రెస్ కార్పొరేటర్లు బొంతల రాజేష్, ఇంజపురి పులేందర్, దాతు శ్రీనివాస్, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు వారు ప్రకటన విడుదల చేశారు. టీయూఎఫ్ఐడీసీకి సంబంధించి కాగితం ఇచ్చారే తప్ప నిధులు ఇవ్వలేదని, నిధులు లేక వాటిని రద్దు చేశారన్నారు. అలాగే 2017లో సీఎంఏ గ్రాంట్ నిధులు మంజూరైతే కేవలం రూ.40 నుంచి రూ.50కోట్ల పనులు మాత్రమే అయ్యాయని, వాటికి బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు చెప్పులరిగేలా తిరుగుతున్నారని, పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయన్నారు. చందర్ కార్పొరేషన్‌కు నిధులు ఇప్పించలేకపోయారన్నారు. ఇప్పటికైనా ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణం

ధర్మారం, మార్చి12: మండల కేంద్రంలోని రామాలయంలో పుష్కర బ్రహోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ పట్టాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ పూస్కూరి పద్మజ, మాజీ సర్పంచ్ పూస్కూరి జితెందర్‌రావు, పూజారులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సమష్టి కృషి : కలెక్టర్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 12 : విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, దీని సాధన కోసం పాఠశాలల్లో పేరెంట్, టీచర్స్ మీటింగ్ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాఠశాలలోని విద్యార్థుల కోసం పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్) కార్యక్రమం నిర్వహణపై ఉపాధ్యాయులకు కల్పిస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యలో మంచి మార్పులు సాధించే దిశగా గత 9 నెలలుగా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామని, విద్యా శాఖలోని ఉపాధ్యాయులు చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 90 శాతానికి చేరుకుందని అన్నారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల టీఎల్ఎం, బోధన పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యుత్తమ బోధన పద్ధతులను అవలంబిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నిరంతరాయంగా విద్య అందించాలనే ఉద్దేశంతో రాబోయే వేసవి కాలంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక సమ్మర్ క్యాంపులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, తద్వారా పిల్లలకు కొత్త అంశాలు నేర్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈవో మాధవి, పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగుండంలో 1800మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మార్చి 12: రామగుండంలో 1800మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఇక్కడ సహజ వనరులు ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని విస్తరించకుండా ఈ ప్రాంతాన్ని చీకటి మయం చేశారని, ఇక్కడ అన్నీ వనరులు ఉన్నాయని, రామగుండం బీ పవర్‌హౌస్‌ను విస్తరించి 1800మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడ నిరుద్యోగ సమస్య తీరుతుందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. అదేవిధంగా సింగరేణి, జెన్‌కో స్థలాల్లో నివాసుంటున్న వారికి పట్టాలు మంజూరు చేసి క్రమబద్ధీకరించాలని ఉప ముఖ్యమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సింగరేణి, జెన్‌కో ప్రాంతాల్లోని నివాసాలకు పట్టాలు ఇచ్చేందుకు హామీ ఇచ్చి నట్టు మక్కాన్‌సింగ్ తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనుల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్

సుల్తానాబాద్, మార్చి 12: సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైనుకు పెద్దగా లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో తాగునీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడింది. ఏడాది క్రితం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో గల మజీద్ మూల మలుపు వద్ద స్వర్ణకార కుటుంబానికి చెందిన ఇంటి ముందు క్వారీ నుంచి బండలు తెస్తుండగా పెద్ద బండరాయి అక్కడ పడిపోయింది. దీంతో బండరాయి బరువుకు భూమిలోపల ఉన్న పైపులైన్ దెబ్బతిన్నది. అప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మళ్లీ ఇదే స్థలంలో లీకేజీలు ఏర్పడడంతో సరఫరాకు ఆటంకం కలిగింది. ఈ లీకేజీల మూలంగా సోమ, మంగళవారాలలో కొన్ని వార్డులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కమిషనర్ వేణుమాధవ్, మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది లీకేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన చేయిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు తాము పనుల వద్దనే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నామని చైర్‌పర్సన్, కమిషనర్‌లు తెలిపారు. బుధవారం నుంచి పట్టణంలో యథావిధిగా తాగునీటి సరఫరా కొనసాగుతుందని వారు తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపు



మంథనిలో అక్రమ కట్టడాల కుల్చివేత..



ఎన్టీపీసీలో అక్రమ నిర్మాణాల తొలగింపు..

మంథని, మార్చి 12: మంథని మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం మంగళవారం వేటు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు భవనాలను పోలీస్ బందోబస్తు మధ్య పాక్షికంగా ధ్వంసం చేశారు. మరికొన్ని భవనాలకు తాళం వేసి సీజ్ చేశారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన పలు కట్టడాలపై టాస్క్‌ఫోర్స్ టీం రంగంలోకి దిగి సెట్‌బ్యాక్ కోసం పాక్షికంగా కూల్చివేసింది. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన పట్టణంలోని రెడ్డి సంక్షేమ సేవా సంఘం భవనాన్ని టాస్క్‌ఫోర్స్ టీం సీజ్ చేసింది. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన పలువురి భవనాలను పాక్షికంగా జేసీబీ సాయంతో కూల్చివేసింది. ఈక్రమంలో పలువురు బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లారు. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ గిరి మాట్లాడుతూ మంథని మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో పిల్ దాఖలు చేశారన్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించామన్నారు. డీటీ గిరి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎస్ఐ వెంకటకృష్ణ, టీపీవో యశ్వంత్, ఫైర్‌స్టేషన్ ఇన్ చార్జి సదానందం, అధికారులు ఉన్నారు.

జ్యోతినగర్ : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్, ముబారక్ సర్వీస్ రోడ్డు పరిధిలో అక్రమ కట్టడాలను మంగళవారం రామగుండం కార్పొరేషన్ అధికారులు తొలగించారు. గ్రీన్‌బెల్ట్‌గా గుర్తించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన నాలుగు కట్టడాలను కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.శ్రీకాంత్ అక్రమ నిర్మాణాల తొలగింపును పరిశీలించారు. గ్రీన్‌బెల్ట్ పరిధిలో ఉన్న మిగతా నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ అధికారులు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు.

పకడ్బందీగా 'పోషణ పక్షం' అమలు : కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లిటౌన్, మార్చి 12: నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పోషణ పక్షం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ సమీకృత కలెక్టరేట్‌లో పోషణ పక్షం పోస్టర్‌ను అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 23వరకు పోషణ పక్షం కింద నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటల ద్వారా పోషకాహారంపై ప్రచారం చేయాలని, రక్తహీనత తగ్గించేందుకు గిరిజన గ్రామాల్లో చిరుధాన్యాలు, స్థానిక ఆహారం, సంప్రదాయ ఆహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో సీహెచ్ మధుమోహన్, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమానాయక్, జిల్లా సంక్షేమ అధికారి రోఫ్‌ఖాన్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, డీసీపీవో కమలాకర్, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ హసీబ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కోల్‌సిటీటౌన్, మార్చి 12: రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలన్న సుప్రీం కోర్టు మాటను ఎస్‌బీఐ బ్యాంక్ ధిక్కరించడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు కుమారస్వామి, మహేశ్వరి, నాయకులు లక్ష్మారెడ్డి, సాగర్, రాజ్‌కుమార్, సురేష్, క్రాంతి, భాగ్య, పీర్ మహ్మద్, లావణ్య, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

వీణవంక,మార్చి12: మండల కేంద్రానికి చెందిన నీల సాయి కిరణ్, మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీకి చెందిన మారపాక రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండు నెలలుగా అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధిస్తున్నట్లు రమ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

బాలిక కిడ్నాప్ : కేసు నమోదు

రామడుగు, మార్చి 12: మండలంలోని గోపాల్‌రావుపేటలో బాలికను కిడ్నాప్ చేసిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమెదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువ నీటి కోసం రైతుల రాస్తారోకో



చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

చొప్పదండి, మార్చి 12: తమ పంటలకు కాలువ నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చేశారు. చొప్పదండి శివారులో డి87 కాలువ వద్ద రాయపట్నం రహదారిపై మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లితో పాటు మండల రైతులు రాస్తారోకో చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నీటిని వారబందీ పద్ధతిలో ఆయకట్టుకు అందిస్తున్నారని డి-87 కాలువకు నీటిని వదిలినా చివరి పొలాలకు నీరు అందడం లేదని పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ చివరి పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా చామనపల్లి రైతులతో పాటు కాలువ ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

» నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది

» హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

» జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్

» యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.



ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు పూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

» రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం

» కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

» డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర

» వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

» 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు

» హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ

» భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

» మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన

» విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్ల రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

» కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం

» నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

» నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

» ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్

» దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి

» గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

సంక్షిప్త సమాచారం

● సుల్తానాబాద్ : ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందుతుందని కరీంనగర్ అల్ఫోర్స్ మహిళ డిగ్రీ,పీజీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గర్రెపల్లిలో మంగళవారం అల్ఫోర్స్ మహిళ డిగ్రీ కళాశాల వారి జాతీయ సేవా పథకం వారం రోజుల శీతాకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు, ఎంపీటీసీ పులి అనూష, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, ప్రోగ్రాంఅధికారులు రజిత, ఐలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకాన్ని జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎంపీవో సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని భోజన్నపేట గ్రామంలో ఉపాధి హమీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ జాబ్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు.వెంట ఏపీవో రమేష్‌బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయతీ కార్యదర్శి దివ్య ఉన్నారు.

● పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దబొంకూర్ పరిధిలోని కల్వ చెరువు మట్టిని చీకురాయికి చెందిన కొందరు ఈజీఎస్ కూలీల ద్వారా సేకరించి మట్టి దందా చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ మిట్టపల్లి వసంత-వెంకటేశంలు పంచాయతీ కార్యదర్శి స్వప్నకు ఫిర్యాదు చేశారు. అలాగే హుస్సేన్‌మియా వాగులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని వాటిని ఉన్నతాధికారులకు నివేదించాలని పంచాయతి కార్యదర్శిని వినతిలో కోరారు.

● ఎలిగేడు : మండల కేంద్రానికి చెందిన సీపీఐ ఉద్యమ నేత బుర్ర కొండయ్య అనారాగ్యంతో మృతిచెందగా మంగళవారం ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావులు వేర్వేరుగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్దినేని ప్రసాద్‌రావు, కొక్కిరాల మహేశ్వరరావు, దుగ్యాల సంతోష్‌రావు, చక్రధర్‌రావు, తానిపర్తి మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మండిగ రాజనర్సు, రంగు శ్రీనివాస్, కేడీసీసీబీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ : గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి వీర్లపల్లెలోగల ఈశ్వర కృప వృద్ధాశ్రమాన్ని సీఐ రవీందర్ సందర్శించారు. 25కిలోల బియ్యాన్ని వృద్ధాశ్రమానికి సీఐ రవీందర్ అందజేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు పీటీ స్వామి, గంటా సత్తయ్య, మాధవరెడ్డి, రామచందర్‌రావు, శ్రీనివాసరావు, సత్యనారాయణలు పాల్గొన్నారు.

● పాలకుర్తి : మండల కేంద్రంలోని పాలకుర్తి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం మాజీ సర్పంచ్ దుర్గం జగన్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

● పాలకుర్తి : మండలం పరిధిలోని కేశోరాం సిమెంటు కంపెనీలో ఓబీ రిజిస్ట్రార్ జనని కాంట్రాక్టు కార్మిక సంఘం నూతన కమిటీని కార్మికులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కేశోరాం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, అధ్యక్షుడిగా దాడి మహేష్, ప్రధానకార్యదర్శిగా తోట మహేష్, వర్కింగ్ ప్రెసిడెంటుగా ముక్కెర శ్రీనివాస్, ప్రధాన సలహాదారుడిగా బసంత్‌నగర్ మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

● అంతర్గాం : దేశవ్యాప్తంగా ఈనెల 14న తలపెట్టిన ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు మేరుగు చంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ధర్నాకు రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వేల్పుల సాంబయ్య, లింగంపల్లి సతీష్, తమ్మనవేని రాజకొమురయ్య, రవి, తిరుపతి పాల్గొన్నారు.

● అంతర్గాం : రామగుండం పట్టణంలోని 22వ డివిజన్ ఏరియా అయోధ్యనగర్‌లో రోడ్డుకు అడ్డుగా నిరుపయోగంగా ఉన్న కరెంటు స్థంబాలను మంగళవారం కార్పొరేటర్ కౌశికలతహరి తొలగింపజేశారు. ఏడీఈ రాజ్‌కుమార్, ఏఈ దామోదర్, మామిడి శంకర్, కుక్క గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ : కాంగ్రెస్ సోషల్ మీడియా పెద్దపల్లి జిల్లా కో ఆర్డినేటర్‌గా గోదావరిఖనికి చెందిన దూళికట్ట సతీష్‌ను నియమిస్తూ టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ కో ఆర్డినేటర్ పెట్టెం నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

● ఓదెల : వంటకు పనికిరాని బియ్యాన్ని ఓదెల మండలంలోని రేషన్ వినియోగదారులకు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని 13615 రేషన్‌కార్డుల వినియోగదారులుండగా ప్రతినెలా 23 రేషన్ షాపుల ద్వారా 236 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గతంలో సివిల్ సప్లై గోదాముల్లో నిలువ ఉంచిన పాత బియ్యం గడ్డకట్టి ఉన్నాయి. వీటినే మండలంలోని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. బియ్యం దుర్వాసన, లక్క పురుగులు, తవుడుతో కలిసిపోయిన బియ్యాన్ని ఏ అధికారి కూడా పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడెం స్వామి అధికారులను కోరారు.

● అంతర్గాం, మార్చి 12: రామగుండం రైల్వే స్టేషన్‌లో రూ.26కోట్లతో చేపడుతున్న పనులను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం హాజరైన మాట్లాడారు. అనంతరం రైల్వే అధికారులు ఆమె సన్మానించారు. స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, నాయకులు అనుమాస శ్రీనివాస్, ధర్మపురి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● గోదావరిఖని : స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం సీఈఆర్ క్లబ్‌లో జిమ్‌ను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ప్రారంభించారు. ఎస్ఓటు జీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీ నారాయణ, అరెల్లి పోషం, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, అడ్డాల స్వరూపరామస్వామి తదితరులున్నారు.

ఓడేడు వంతెన పూర్తయ్యేదెన్నడో?

- ఎనిమిదేళ్లు కావస్తున్నా అసంపూర్తిగానే పనులు - వర్షాకాలంలో వాగు దాటేందుకు తప్పని ఇబ్బందులు

- తాత్కాలికంగా మట్టి రోడ్డు వేసి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు - పట్టించుకోని అధికారులు



ఓడేడు వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన



అనధికారికంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్

ముత్తారం, మార్చి 12:పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దులో ఓడేడు వద్ద మానేరు వాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. పనుల కోసం రూ.47 కోట్లు మంజూరైన వంతెన నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. పనులు మొదలై 8 ఏళ్లు కావస్తున్నా ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై ఈప్రాంత ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. జిల్లాలోని మంథని నుంచి వరంగల్, హనుమకొండ వెళ్లేందుకు దూరభారం తగ్గే అవకాశం ఉంటుంది. ఈ వంతెన నిర్మాణం కోసం సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

వర్షాకాలంలో తప్పని తిప్పలు..

మండంలోని ఓడేడు గ్రామ శివారులోని మానేరు వాగు వర్షాకాలంలో ఉప్పొంగి ప్రవహిస్తుంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ వాగు సరిహద్దు గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనికి వెళుతుంటారు. వాగుకు అవతలి వైపు పంటపొలాలు ఉండడంతో రైతులు వాగు దాటాలంటే నానా తిప్పలు పడుతుంటారు. ఓడెడ్‌కు చెందిన గీత కార్మికులు వాగుదాటి తాటిచెట్లు ఎక్కేందుకు ప్రాణాల చేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన వస్తుంది. వాగు అవతల ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లోనూ అదే పరిస్థితి. దశాబ్ద కాలం క్రితమే అప్పటి ప్రభుత్వాలకు వాగు పరిస్థితిపై ఈప్రాంత ప్రజాప్రతినిధులు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం దక్కలేదు. మానేరు వాగులో రేడ్డు పొడవునా విస్తీర్ణం ఎక్కువ ఉన్నందున అధికంగా నిధులు కావాల్సి ఉంటుందని మభ్యపెట్టి దాటవేశారని చెబుతున్నారు.

2016లో వంతెనకు శంకుస్థాపన..

జిల్లా సరిహద్దు ప్రాంత ప్రజల కోరిక మేరకు మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించి 2016లో రూ.47కోట్ల మంజూరుచేసింది. 2016 ఆగస్టు 6 మానేరుపై వంతెన నిర్మాణానికి అప్పటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, భూపాలపల్లి ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు శంకుస్థాపన చేశారు. ఏడాదిలోపే వంతెన పనులు పూర్తి చేశామని హామీ ఇచ్చారు. కానీ దశాబ్ద కాలం దగ్గరికి వస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తికాలేదు.

తగ్గనున్న దూర భారం..

మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మిస్తే దూర భారం తగ్గనుంది. మానేరు వాగు మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల మండలాల నుంచి మంథనికి 35 కిలోమీటర్ల దూరం మాత్రమే వస్తుంది. ఇటు కరీంనగర్ నుంచి లేదా భూపాలపల్లి నుంచి తిరిగి వెళ్లాలంటే సుమారు 140 కిలోమీటర్ల వస్తుంది. వంతెన నిర్మాణంతో కరీంనగర్ జిల్లాలోని గోదావరిఖని, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి పరకాల హనుమకొండ, వరంగల్‌తో పాటు జమ్మికుంట, హుజురాబాద్ తదితర పట్టణాలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఈ ప్రాంతం మీదుగా వెళ్లనున్నాయి.

అక్రమంగా మట్టి రోడ్డు.. అడ్డగోలు వసూలు..

వంతెన నిర్మాణంలో జాప్యాన్ని ఆసరా చేసుకొని ముత్తారం మండలంలోని ఓడేడు, జయశంకర్ భూపాలపల్లి ఇల్లాలోని గర్మిళ్లపల్లి గ్రామాలకు చెందిన కొందరు అందినంత దండుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే మానేరులో వాగు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేసి పన్ను వసూలు చేస్తున్నారు. టోల్‌గేట్ ఏర్పాటు చేసుకొని బైకులు మొదలుకొని లారీల వరకు ప్రతి ఒక్కరి దగ్గర అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గోదావరిఖని, మంథని నుంచి చిట్యాల, పరకాల, హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు దూరభారం తగ్గించుకునేందుకు ఈ రోడ్డు గుండా వెళుతూ తమ జేబులకు ఖాళీ చేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం అంటూ లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని సామాన్య ప్రజలకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు వంతెన నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



శివపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, మార్చి 12 : గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంటా విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో మంగళవారం 4కోట్ల 15లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందని, అందుకు కట్టుబడి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, నాయకులు సామరాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, విండో చైర్మన్ విజయబాస్కర్‌రెడ్డి, గోదెల శ్రీనివాస్‌రెడ్డి, నరహరి సుదాకర్‌రెడ్డి, హర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతి, పల్లెర్ల వెంకటేశ్, అశోక్‌రెడ్డి, భూర్ల వెంకటసత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం..

జూలపల్లి, మార్చి 12 : ప్రజలకు సంక్షేమ పథకాలు, మౌళిక అవసరాలు, అభివృద్ధి పనులు చేయడం ఏదైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే సాధ్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోనూ మంగళవారం 90లక్షల రూపాయలతో చేపట్టి పూర్తి చేసిన సీసీ రోడ్ల ప్రారంభించారు. అలాగే నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల నాయకులతో కలిసి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, ఎంపీపీ రమాదేవి, విండో చైర్మన్ ఫుల్లూరి వేనుగోపాల్‌రావు, విండో మాజీ చైర్మన్ గండు సంజీవ్, మాజీ సర్పంచ్ నర్సింహయాదవ్, నాయకులు బొజ్జ శ్రీనివాస్, జెట్టి సతీష్, చెన్నమనేని విద్యసాగర్‌రావు, కన్నం రాంనారాయణ, కోరెపు సంపత్, పోచాలు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో 89శాతం ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు

- నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

కోల్‌సిటీ, మార్చి 12: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రామగుండం నగరపాలక సంస్థలో నిర్దేశించిన లక్ష్యానికి 89శాతం ట్రేడ్ లైసెన్స్‌లను వసూలు చేసినట్టు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ ఫీజు లక్ష్యం రూ.44లక్షలు కాగా ఇందులో 89శాతం వసూలైందని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తామని పేర్కొన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అన్ని వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. ఇంకా ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించని వ్యాపార సంస్థల నిర్వహకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

సుల్తానాబాద్, మార్చి 12: ఆధునిక సాంకేతిక సాగు పద్ధతుల గురించి జిల్లాలోని రైతులకు వీడియో గోష్టి ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మండలంలోని కాట్నపల్లి రైతు వేదిక వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా మామిడి తోటలకు సంబంధించి పూత పిందె రాలుట, వాటి నివారణ చర్యలు, యజమాన్య పద్ధతులు, వేసవిలో అధికఉష్ణోగ్రత వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో పెద్దపల్లి రూరల్ ఏడీఏ శ్రీనాథ్, సుల్తానాబాద్ ఏవో డేవిడ్‌రాజ్, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఏఈవోలు రైతులు పాల్గొన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ప్రతి రోజు మంగళ, శుక్రవారాల్లో నిర్వహించడం జరుగుతుందని, రైతులు తప్పనిసరిగా రావాలని ఏవో డేవిడ్ రాజు, ఏఈవో సౌమ్య తెలిపారు.

మెయింటనెన్స్ పేరుతో కరెంటు కోతలు

ముత్తారం, మార్చి 12: రోజుకో సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మెయింటనెన్స్ పేరుతో ఉదయం 08 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంటు కోతలు విధిస్తున్నారు. గత ఆదివారం ముత్తారం సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటనెన్స్ పేరుతో ముత్తారం, దర్యాపూర్, కేసనపల్లి, పారుపల్లి, శాత్రాజపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సోమవారం అడవిశ్రీరాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఓడేడు, అమరాబాద్, మంగళవారం ఖమ్మంపల్లి, సీతంపేట, ఇప్పలపల్లి, జిల్లాలపల్లి, శుక్రవారంపల్లి, రంగయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆయాగ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పోరట్‌పల్లిలో వ్యక్తి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 12 : రామగుండం మున్సిపల్ 3వ డివిజన్ న్యూపోరట్‌పల్లికి చెందిన బుట్టి వేణు(40) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ పోలీసులు పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నాడు. అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాఘవపూర్‌లో ప్యాసింజర్ రైళ్లను ఆపాలి

పెద్దపల్లి రూరల్, పాలకుర్తి మార్చి 12: పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ రైల్వేస్టేషన్‌లో సింగరేణి, రామగిరి ప్యాసింజర్ రైళ్లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని రామగుండం రైల్వే ఏరియా ఆఫీసర్ కృష్ణమోహన్‌కు అందుగులపల్లి గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ కారే శారదా-శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు ఎండీగౌస్, మాజీ ఎంపీటీసీ చీకటి సరోజన చంద్రయ్య, మాజీ సర్పంచ్ గుండా లక్ష్మి నారాయణ, నాయకులు ఎంచర్ల అంజయ్య సిద్ధ గట్టయ్య, అప్పాల హరీష్, ఇట్యాల సతీష్, అరె కుమార్, సిద్ధ రవి, దామా రాజు, బొక్కల రవీందర్, కారే సది ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 12: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలలని పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని మారేడుగొండ గ్రామంలో గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో ముఖ్య అతిధిగా తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అదికారి ఎంఏ సమద్, అద్యాపకులు సదానందం, ఆమని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ముత్తారం, మార్చి 12: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో ఎస్సై పాత్రికేయులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. సీపీ, ఏసీపీ, మంథని సీఐల సూచనల మేరకు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక, వారు ప్రతి వారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టాలన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, మార్చి 12 : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు అన్నారు. మంగళవారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. శ్రీనివాస్ 10 విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, డాక్టర్ వేల్పుల సురేందర్, శ్రీకర్, శ్రీనివాస్, రాజు, లక్ష్మీ ప్రసన్న, జయలక్ష్మీ, శ్రీలత, సుజన్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నియామకం

పెద్దపల్లిటౌన్, మార్చి 12: జాతీయ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా ముల్కల అశోక్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కటుకూరి సందీప్ నియామక పత్రాన్ని అందించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో పాలకుర్తి మండల అధ్యక్షులుగా ముల్కల లస్మయ్య, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగ్గిల్ల సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా గుగ్గిల్ల అభిలాష్‌ను నియమించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని కటుకూరి సందీప్‌కు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.

మాదిగలకు మూడు ఎంపీ స్థానాలు కేటాయించాలి

పెద్దపల్లి టౌన్, మార్చి 12: పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు మూడు పార్లమెంటు స్థానాలను కేటాయించాలని కోరుతూ మాదిగ శక్తి ఆధ్వర్యంలో వెయ్యి డప్పులతో తరలివెళ్లి గాంధీభవన్‌లో వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని గజ్జెల కాంతం, వరంగల్ స్థానాన్ని పిడమర్తి రవి, మరో జనరల్ స్థానాన్ని కూడా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జెల ఆనందరావు, పేట భాస్కర్, కల్లేపల్లి రవి, కుక్క చంద్రమౌళి, సముద్రాల అజయ్, మీసాల సాయిలు, రాచపల్లి వంశీ, దూడ భూమయ్య, చెవుల మద్ది వినోద్, మల్యాల తిరుపతి పుల్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి'

పెద్దపల్లి రూరల్, మార్చి 12: ఇంటర్ పూర్తి చేసుకునే విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మీనర్సయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అందిస్తున్న సదుపాయాలు, విద్యాబోధన, ల్యాబ్‌తో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వివరాల కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అధ్యాపకులు నితిన్, మేజర్ రెవెల్లి సంజీవ్, శ్రీనివాస్, రామకృష్ణ, అర్జున్, రవిందర్‌రావు, కిరణ్మయి, సునిత, రజిత, సతీష్, రమేష్, తిరుపతిలు పాల్గొన్నారు.

గృహజ్యోతికి దరఖాస్తుల వెల్లువ



ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులను సమర్పిస్తున్న వినియోగదారులు

ఓదెల, మార్చి 12: మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం వివిధ గ్రామాల నుంచి గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ వినియోగదారులు దరఖాస్తులతో తరలివచ్చారు. నెలక్రితం ప్రజాపాలన గ్రామసభల్లో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఇందులో 200 యూనిట్ల ఇంటి విద్యుత్ మాఫీ కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు సమర్పించగా, కార్యాలయంలో నిరంతరం దరఖాస్తుల డాటాను కంప్యూటరీకరించారు. ఈ సమయంలో సక్రమంగా డాటా ఎంట్రీని నిర్వహించకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దరఖాస్తులో నమోదు చేసిన విధంగా కాక, కంప్యూటర్‌లో ఇంటి విద్యుత్ సర్వీస్ నెంబర్లను, యుఎస్ఇ నెంబర్లను నమోదు చేయకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్తు కొందరు వినియోగదారులకు వర్తించలేదు. దీంతో ప్రతిరోజు మండల పరిషత్ కార్యాలయానికి 200మంది వినియోగదారులు వస్తూ, మళ్లీ దరఖాస్తులను సమర్పిస్తున్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఉచిత విద్యుత్ కోసం వినియోగదారులు మళ్లీ దరఖాస్తులు సమర్పించారు.

రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా మల్లికార్జున్

కళ్యాణ్‌నగర్, మార్చి 12: లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం 2024-25 సంవత్సరానికి గాను అధ్యక్షునిగా పిల్లి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ ఎల్లప్ప, కోశాధికాధికారిగా పాకాల గోవర్ధన్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముద్దసాని ప్రమోద్ కుమార్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కంజపురి రాజేందర్, బంక రామస్వామి, గుగ్గిళ్ల రవీంద్రచారి, రాజేష్‌శర్మ, కామ విజయ్‌తో పాటు లయన్స్‌క్లబ్ సభ్యులు అభినందించారు.



పిల్లి మల్లికార్జున్, వడ్లకొండ ఎల్లప్ప



పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 12: రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్‌ని మంగళవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రామగుండం ఏరియా-2 సంబంధించిన వివరాలు, బొగ్గు ఉత్పత్తి, రవాణాలను వివరించారు. సింగరేణి స్థితిగతులు, ఆర్జీ-2 పరిధిలో శాంతిభద్రతల అంశాలపై చర్చించారు. జీఎం వెంట సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్ ఉన్నారు.

ఓసీపీ-3 రిలే-బీ కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 12: ఓసీపీ-3 ప్రాజెక్టు రిలే-బీ ఏఐటీయూసీ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రాజెక్టు సమస్యలను రిలే-బీ కార్మికులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. హెచ్ఎంఎస్ అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ జంగిలి లక్ష్మయ్య ఏఐటీయూసీలో చేరారు. రిలే-బీ సెక్రెటరీగా ధనుంజయ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, జంగిలి లక్ష్మయ్య, 60 టన్నుల ఇంచార్జిగా అనిల్ కుమార్, షావల్ సెక్షన్ ఇంచార్జిలుగా శ్రీనివాస్, రాజిరెడ్డి, కేబుల్ బాయ్ ఇంచార్జిగా రాజ్‌కుమార్, జనరల్ మజ్దూర్‌ల ఇన్‌చార్జిగా మధుకర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, సెంట్రల్ సెక్రెటరీ రాజారత్నం, బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, అసిస్టెంట్ సెక్రెటరీ శ్యాంసన్, పిట్ సెక్రెటరీ ఇజ్జ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్థను అభివృద్ధి చేసే బాధ్యత మాదే..

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

గోదావరిఖని, మార్చి 12: సింగరేణిని కాపాడి, అభివృద్ధి చేసే బాధ్యత మాదేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో దాదాపు 1900 ఉద్యోగాలను భర్తీచేయనున్నట్లు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో సింగరేణి గెస్ట్ హౌస్ శంకుస్థాపనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంలో 489ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, మరో 1352 ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణికి హైదరాబాద్‌లో గెస్ట్‌హౌస్ లేకపోవడం బాధాకరమని, కార్మికులు, అధికారుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. సింగరేణి ప్రాంతానికి చెందిన తనకు ఈ అతిథి గృహాన్ని ప్రారంభించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో జైపూర్‌లో నిర్వహిస్తున్న ప్రస్తుత 1200మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో త్వరలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే రామగుండంలో జెన్‌కో ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్లాంట్ ఆవరణలో సింగరేణి ఆధ్వర్యంలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు త్వరలోనే చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో సింగరేణి థర్మల్ సామర్థ్యం 2800 మెగావాట్లకు చేరుతుందన్నారు. సింగరేణి సుస్థిర భవిష్యత్ కోసం, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం కొత్త గనులను ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని కలిసి తాడిచర్ల-2 గనిని సింగరేణికి కేటాయించేందుకు విజ్ఞప్తి చేయగా సానుకూల స్పందన లభించిందన్నారు. అలాగే నైనీ గని ప్రారంభానికి ఉన్న అవాంతరాలను తొలగించేందుకు ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడించడం జరిగిందన్నారు.సింగరేణి ఆధ్వర్యంలోని రాష్ట్రంలోని భారీ జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, ఓపెన్ కాస్టులపై పవన విద్యుత్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సింగరేణిలో ఎస్సీఎస్టీ లైజన్ ఆఫీసర్లు ఉన్న మాదిరిగానే బీసీ లైజనింగ్ ఆఫీసర్ నియామకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సీఎండీ ఎన్ బలరాం నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, ప్రేమ్ సాగర్‌రావు, మాజీ ఎంపీ, భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్ పాల్గొన్నారు.